సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 29 । మార్చి । 2025



సోమశిలలో 53.729 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 53.729 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువన కాలువలకు 1,080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.91,980
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,318
3శాతం జీఎస్టీతో	రూ.8,568
నవర (8గ్రా)	రూ.68,544

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.5 /26.4

జిల్లాలో వాతావరణం శనివారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 65 శాతంగా నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శనివారం	ఆదివారం
సా: 6.22	ఉ: 4.46

సపోరా



జిల్లాలో ఉలవపాడు పండ్ల తోటలకు ప్రసిద్ధి. ఇక్కడి మామిడి తర్వాత అత్యధిక విస్తీర్ణంలో సపోటా సాగవుతోంది. ఉలవపాడు మామిడితోపాటు సపోటాకు దేశీయంగా ఖ్యాతి ఉంది. కాయల నాణ్యతతోపాటు రుచి మధురంగా ఉంటాయి. అటువంటి సపోటా పంట రైతులను తారెత్తిస్తోంది. ఒక పక్క దళారుల దోపిడీ, మరో పక్క ధరల పతనం, ఇంకోవైపు ప్రభుత్వం నుంచి అందని మద్దతు వెరసి.. సపోటా సాగుకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. పెట్టుబడులు పెట్టినా.. రాబడి లేక రైతులు తోటలను కొట్టివేస్తున్నారు.



తోటలను కొట్టి కర్రలు తీస్తున్న కూలీలు

మార్కెటింగ్‌లో దళారుల దోపిడీ

- లాభసాటిగా లేని పంట దిగుబడి, తగ్గిపోయిన ధరలు
- ప్రభుత్వం నుంచి అందని మద్దతు
- తోటలు కొట్టేస్తున్న రైతులు

ఉలవపాడు: అందరి నోరూరించే తియ్యటి ఉలవపాడు సపోటా.. రైతులకు మాత్రం నష్టాలను మిగులుస్తోంది. ఉలవపాడు సపోటాకు దేశీయంగా డిమాండ్‌తోపాటు ఆదరణ ఉంది. కానీ రైతులు మాత్రం ధరలాటలో దగా పడుతున్నారు. ఉలవపాడు మండలంలో గతంలో సుమారు 7 వేల ఎకరాల్లో సపోటీ సాగు జరుగుతుండేది. కానీ గడిచిన ఏడేళ్లుగా సపోటా వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదు. సాగు ఖర్చులు, కాయల అమ్మకానికి మధ్య భారీ వ్యత్యాసం ఉండడంతో నష్టాలే మిగులుతుండడంతో రైతులు సపోటా సాగుపై అయిష్టత చూపుతున్నారు. కొంత కాలంగా తోటలను రైతులు కొట్టి వేసి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల కాలంలో సుమారు 1000 ఎకరాల సపోటా తోటలను కొట్టి వేశారు. ప్రస్తుతానికి సుమారు 5000 ఎకరాల్లోనే సాగవుతోంది. ఇక ఈ ఏడాది ఈ–క్రాప్‌లో కేవలం 1,400 ఎకరాలు మాత్రమే సాగు చేస్తున్నట్లు నమోదైంది. ఈ–క్రాప్‌లో నమోదు కాకుండా అదనంగా మరో 3000 ఎకరాలు పైనే ఉంటుంది. ఉద్యాన శాఖ సైతం మామిడిపై చూపిన శ్రద్ధ సపోటాపై చూపడం లేదు. మామిడి రైతులకు శాస్త్రవేత్తలను రప్పించి సాగు మెళకువలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ సపోటా రైతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీనికి తోడు మార్కెట్‌లో దళారుల హవా కారణంగా సపోటా రైతు చిత్తయిపోతున్నాడు.

దేశీయంగా డిమాండ్

ఆంధ్రప్రదేశ్‌లో సపోటా అంటే గుర్తుకు వచ్చేది ఉలవపాడే. ఇక్కడ పాల సపోటా, ఫారిన్ సపోటా, బిళ్ల సపోటా రకాలు సాగు చేస్తారు. ఎక్కువగా ఫారిన్ సపోటా కాయలు ఎగుమతి అవుతాయి. తెలుగు రాష్ట్రాల ప్రజలు మాత్రం పాల సపోటాను ఇష్టపడతారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రజలు ఫారిన్ సపోటా ఇష్టపడతారు. అందుకే ఫారిన్ సపోటా రకం ఎగుమతులు అధికంగా జరుగుతాయి. బిళ్ల రకం కూడా ఎగుమతులు జరుగుతాయి. ప్రధానంగా చెన్నై మార్కెట్‌కు అధికంగా ఈ సపోటా వెళ్తోంది. చెన్నై, హైదరాబాద్, వేలూరు, బెంగళూరు, విశాఖపట్నం, ముంబైలకు ఎగుమతి చేస్తారు. లారీలు, బస్సులు, మినీ వాహనాల ద్వారా కాయల ఎగుమతులు జరుగుతాయి.



గతంలో తోటల విస్తీర్ణం	- 7 వేల ఎకరాలు
ప్రస్తుతం సాగు	- 5 వేల ఎకరాలు
సీజన్ ప్రారంభంలో (50-60 కేజీలు) ధర	- రూ.1,200
ప్రస్తుతం (50-60 కేజీలు) ధర	- రూ.500 లోపే

దళారుల ధరలాట

ఉలవపాడు రైతులు నేరుగా కాయలు అమ్ముకునే అవకాశం లేదు. ఇక్కడి సపోటాలు దేశీయంగా వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేయడం అంటే రైతులకు సాధ్యపడకపోవడంతో దశాబ్దాలుగా దళారులనే రైతులు నమ్ముకుంటున్న పరిస్థితి ఉంది. ఉలవపాడులోని మెయిన్ రోడ్, బైపాస్‌ల్లో సుమారు 20 మంది పైగా దళారులు తమ సొంత మార్కెట్ నడుపుతుంటారు. రైతులు సుమారు 50–60 కేజీల కాయల బస్తాలను దళారుల వద్దకు తీసుకువస్తారు. కాయల నాణ్యతను చూసి బస్తా రేటును నిర్ణయిస్తారు. కాయల ప్రారంభంలో బస్తా రూ.700 నుంచి రూ.1,200 వరకు పలుకుతోంది. కాయలు అధికంగా వస్తే బస్తా రూ.500 కన్నా తక్కువకు పడిపోతుంది. చెన్నైకు చెందిన వ్యాపారులు కూడా ఇక్కడ దళారుల మార్కెట్ ఏర్పాటు చేసి ఉన్నారు. దళారులు చెప్పిందే రేటు కావడం, బస్తాకు రూ.100 కమీషన్ రావడంతో వారు మాత్రం లక్షాధికారులు అవుతున్నారు. కానీ రైతు మాత్రం చితికి పోతున్నాడు. ప్రస్తుతం ఉలవపాడు మార్కెట్‌లో పాల సపోటా బస్తా రూ.650, ఫారిన్ సపోటా రూ.700, బిళ్ల సపోటా రూ.600 ధర పలుకుతోంది.

నష్టాల్లో రైతులు



ఏడాదికి రెండు సార్లు దిగుబడి వచ్చే సపోటా సాగుకు అధికంగా ఖర్చవుతోంది. చెట్ల కొమ్మ కత్తిరింపులు, కలుపు చెట్ల తొలగింపు, దుక్కి చేయడం, తోటలకు నీరు కట్టడం వంటి వాటికి ప్రతి సీజన్‌కు ఎకరాకు సుమారు రూ.10 వేలు ఖర్చులు అవుతున్నాయి. ఇక కాయల కోత కూలీలకు ఖర్చు అధికం అవుతుంది. వీటిని మార్కెట్‌కు రైతులే సొంత వాహనం పెట్టుకుని దళారుల వద్దకు చేర్చాలి. వారు నిర్ణయించే ధరకు విక్రయించాలి. ఇక బస్తాకు రూ.100 కమీషన్‌గా ఇచ్చుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఎకరాకు 40 బస్తాల వరకు కాపు వస్తుంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా లేక కాపు తగ్గి 30 బస్తాల దిగుబడి వస్తోందని రైతులు అంటున్నారు.



ఉలవపాడులోని సపోటా తోటలో ఓ చెట్టు



స్థానిక మార్కెట్ ద్వారా ఎగుమతులు

లాభాలు లేక కొట్టివేస్తున్నాం



సపోటా సాగులో లాభాలు లేకపోవడంతో తోటలు కొట్టేస్తున్నాం. ఈ ఏడాది నేను 3 ఎకరాల సపోటా తోట కొట్టేశాను. పెట్టుబడి అధికంగా అవుతుంది. కాయలు అమ్మినా.. నష్టాలే వస్తున్నాయి. అందుకని సపోటా కొట్టి సరుగుడు చెట్లు వేశాను.

– నిషాంత్, రైతు, ఉలవపాడు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



సపోటాలో రైతులకు మంచి దిగుబడి వచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల కొంత నష్టం జరుగుతున్న మాట వాస్తవమే. ఉద్యానశాఖ ద్వారా రైతులకు మేలు జరిగేలా సలహాలు సూచనలు అందిస్తున్నాం.

– జ్యోతి, ఉద్యాన శాఖాధికారిణి

న్యూస్‌రీల్

ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత



గోడౌన్ సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు సిటీ: ఈవీఎంల గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో త్రైమాసిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఈవీఎంల గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. గోడౌన్లలోని ఈవీఎంలు, వీవీ ప్యాట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనూష, తహసీల్దార్ షఫీమాలిక్, డీటీ అశోక్‌వర్ధన్ పలు రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి సోషల్ పరీక్ష 1కి వాయిదా

నెల్లూరు(అర్బన్): ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఈ నెల 31న జరగాల్సిన సోషల్ స్టడీస్ పరీక్షను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలని కోరారు.

పది పరీక్షలకు 28,670 మంది హాజరు

నెల్లూరు (అర్బన్): జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి శుక్రవారం సైన్సు పరీక్ష జరిగింది. 28, 970 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28,670 మంది హాజరయ్యారు. 300 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 130 మంది హాజరుకావాల్సి ఉండగా 110 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు.

ఓపెన్ పరీక్షలకు 208 మంది గైర్హాజరు

పదో తరగతి ఓపెన్ పరీక్షలకు సంబంధించి శుక్రవారం సోషల్ స్టడీస్ పరీక్ష జరిగింది. 1,506 మంది హాజరు కావాల్సి ఉండగా 1,298 మంది హాజరయ్యారు. మిగతా 208 మంది గైర్హాజరయ్యారు.

వైద్యశాఖలో ఎల్‌టీ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు (అర్బన్): జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నామని డీఎంహెచ్‌ఓ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు శనివారం నుంచి ఏప్రిల్ 4వ తేదీలోపు తమ దరఖాస్తులను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు నోటిఫికేషన్, ఇతర వివరాల కోసం ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని సూచించారు.

మాలకొండ హుండీల రాబడి రూ.82 లక్షలు



లెక్కింపు చేస్తున్న అధికారులు సిబ్బంది

వలేటివారిపాలెం: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. 14 శనివారాలకు వచ్చిన హుండీ ఆదాయం లెక్కించగా రూ.82.44 లక్షలు వచ్చినట్లు ఈఓ కే సాగర్‌బాబు తెలిపారు. 178 గ్రాముల బంగారం, కేజీ ఐదు గ్రాముల వెండి, ఫారిన్ కరెన్సీ యూఎస్ డాలర్స్ 56, యూఏఈ దిర్హమ్ 200, ఒమన్ బైసా 700, ఒమన్ రియాల్ 8, ఇంగ్లాండ్ పౌండ్స్ 20, నేపాల్ కరెన్సీ రూ.50 వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపునకు పర్యవేక్షణాధికారిగా వీవీఎల్ రవీంద్రనాథ్ వ్యవహరించారు.

అటవీశాఖకు కొత్త వాహనాలు

నెల్లూరు (అర్బన్): జిల్లా అటవీశాఖకు 10 నూతన మహీంద్ర బొలెరో వాహనాలు మంజూరయ్యాయి. వాటిని ఉన్నతాధికారులు శుక్రవారం వేదాయపాళెంలోని జిల్లా అటవీశాఖా కార్యాలయానికి చేర్చారు. వీటిని క్షేత్ర స్థాయిలో పనిచేసే కింది స్థాయి అధికారులకు కేటాయించనున్నారు. అడవుల్లో తిరిగేందుకు, తనిఖీలు నిర్వహించేందుకు వీటిని వినియోగించనున్నారు. ఈ వాహనాలను డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా పరిశీలించారు. అటవీ శాఖ సీసీఎఫ్ కిందిస్థాయి అధికారులకు అందిస్తారని డీఎఫ్‌ఓ తెలిపారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

- నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి

కోవూరు: నియోజకవర్గంలో పార్టీ నేతలందరూ సమన్వయంతో ముందుకు సాగి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని పడుగుపాడు సొసైటీ మాజీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి నివాసంలో శుక్రవారం పార్టీ నేతల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని, ప్రతి ఒక్కరూ అందరిని కలుపుకుని రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి వ్యూహాత్మకంగా పని చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తకు స్థానికంగా ఉండే మీరు భరోసా కల్పించాలన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరిగినా, ఇబ్బంది కలిగినా కమిటీ సభ్యులందరూ వెళ్లి అండగా నిలవాలన్నారు. రాబోయే రోజుల్లో అందరికీ మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఇప్పటి వరకు కొన్ని పొరపాట్లు జరిగాయని, అలాంటివి ఇక మీదట జరగవన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా తాను ఇకపై జాగ్రత్తలు తీసుకొంటానన్నారు.

కమిటీ సభ్యుల నియామకం

అత్తిపల్లి అనుప్‌రెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, కవరగిరి శ్రీలత, శివుని నరసింహారెడ్డి, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, షేక్ జుబేర్, తాటిపర్తి విజయకుమార్ రెడ్డి, నీలపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, భీమతాటి శ్రీధర్, యరటపల్లి మీరారెడ్డి, జెట్టి శ్యాంసుందర్ రెడ్డి, కాటంరెడ్డి దినేష్‌రెడ్డిలను ఏకగ్రీవ తీర్మానంతో ప్రసన్నకుమార్‌రెడ్డి నియమించారు.



పార్టీ సమన్వయ కమిటీ నేతలతో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్ రెడ్డి

మైనింగ్ కేసులో మరొకరు అరెస్ట్

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో ఉన్న 'రుస్తుం మైన్'లో అక్రమంగా తెల్లరాయిని తరలించారని పోలీసులు నమోదు చేసిన కేసులో మరొకరిని శుక్రవారం పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ–7గా పేర్కొన్న కరుణాకర్‌రెడ్డిని గూడూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఇదే కేసులో ఇటీవల ఏ–6 వేమిరెడ్డి అరవింద్‌కుమార్‌రెడ్డి, ఏ–8 కొండా శివారెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రిమాండ్‌లో ఉన్న వారిని విచారించేందుకు పోలీసులు కస్టడీ పిటిషన్ వేశారు. అయితే ఈ పిటిషన్ ఏప్రిల్ 1న గూడూరు కోర్టులో విచారణకు రానున్నట్లు సమాచారం.

దగదర్తి వైస్ ఎంపీపీ ఎన్నిక నిరవధికంగా వాయిదా



దగదర్తి వైస్ ఎంపీపీ ఎన్నిక కోసం ఎంపీటీసీలు గైర్హాజరవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు, నిరీక్షిస్తున్న ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి

కావలి: నియోజకవర్గంలోని దగదర్తి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్ష పదవికి జరగాల్సిన ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తూ ఎన్నికల అధికారులు నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ పదవికి గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించిన విషయం విదితమే. అయితే గురువారం ఎంపీటీసీ సభ్యులు రాకపోవడంతో శుక్రవారం నిర్వహించేందుకు మరోసారి షెడ్యూల్ ప్రకటించారు. అయితే శుక్రవారం సైతం ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరు కాపోవడంతో నిర్దిష్ట సమయం వరకు వేచి చూసిన ఎన్నికల నిర్వహణాధికారులు నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరిలో శ్రీరామపురం ఎంపీటీసీ సభ్యురాలు పీతల కామేశ్వరమ్మ గతంలో మండల ఉపాధ్యక్షురాలిగా ఉండేవారు. ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం రావడంతో తన ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ పదవులకు రాజీనామా చేశారు. దీంతో వైస్ ఎంపీపీ పదవికి గురువారం ఎన్నిక నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు నెల్లూరు పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సుబ్బరాజును ఎన్నికల అధికారిగా, దగదర్తి ఎంపీడీఓ జి.వెంకటేశ్వర్లు సహాయ ఎన్నికల అధికారిగా నియమించింది. మొదటి రోజు ఎన్నికల షెడ్యూల్ సమయం 11 గంటల వరకు నిరీక్షించినా సమావేశ మందిరానికి ఎంపీటీసీలు ఒక్కరు కూడా రాలేదు. దీంతో ఎన్నికల అధికారి నిబంధనల ప్రకారం మరో గంట సమయాన్ని అదనంగా కేటాయించినా కోరం లేకపోవడంతో ఎన్నికను, శుక్రవారానికి వాయిదా వేశారు. రెండో రోజూ పరిస్థితి అలాగే ఉండడంతో నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అల్లూరు, బిట్రగుంట ఎస్సైలు కె.కిశోర్‌బాబు, భోజ్యా నాయక్ ప్రత్యేక పోలీసులతో కలిసి మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిసరాల్లో బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

7 నుంచి ఎన్‌టీఆర్ వైద్యసేవలు బంద్

- కలెక్టరేట్ ఏఓ, జిల్లా కో ఆర్డినేటర్‌కు వినతిపత్రాల అందజేత



కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (అర్బన్): ఎన్‌టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) ద్వారా రోగులకు చికిత్సలు అందించినప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతున్న దృష్ట్యా ఏప్రిల్ 7వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ఎంపానెల్ కలిగిన ప్రైవేట్, కార్పొరేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు బంద్ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, అరవింద్ కిడ్నీ ఆస్పత్రి అధినేత డాక్టర్ డాక్టర్ ఎస్‌వీఎల్ నారాయణరావు ప్రకటించారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లో పరిపాలనాధికారి విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ ఎన్‌టీఆర్ వైద్యసేవ కింద సుమారు రూ.3,500 కోట్లకు పైగా పెండింగ్ బకాయిలున్నాయన్నారు. ఆ నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో హాస్పిటల్స్ నిర్వహణ అత్యంత భారంగా మారిందన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వైద్యసేవలు బంద్ గురించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ మురళీశంకర్‌రెడ్డి, డాక్టర్ హజరత్‌కుమార్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ జీఎల్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ఫీజుల క్రమబద్ధీకరణ

నెల్లూరు (బారకాసు): మల్టీ ప్లెక్స్‌లు, షాపింగ్ మాల్స్‌ల్లో వాహన పార్కింగ్ ఫీజులను ప్రభుత్వం క్రమబద్ధీకరించిందని, నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి తీసుకు వస్తున్నట్లు కమిషనర్ సూర్యతేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం మల్టీ ప్లెక్స్‌లు, షాపింగ్ మాల్స్‌లో మొదటి 30 నిమిషాల వరకు పార్కింగ్ పూర్తిగా ఉచితమని తెలిపారు. 30 నిమిషాల నుంచి గంట వరకు పార్కింగ్ చేసిన వ్యక్తులు మల్టీ ప్లెక్స్‌లు, షాపింగ్ మాల్స్‌లో ఏదైనా వస్తువు కొన్నట్లుగా బిల్లు చూపిస్తే అలాంటి వారికి ఫీజులు వర్తించవని వెల్లడించారు. బిల్లు చూపించకపోతే అలాంటి వారి నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేయొచ్చని స్పష్టం చేశారు. గంటకుపైగా పార్కింగ్ చేసిన వాహన చోదకులు సినిమా టికెట్, ఇతరత్రా బిల్లులు చూపినట్లయితే ఉచితమని, ఆధారం చూపని వారి నుంచి ఫీజులు వసూలు చేయొచ్చన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు గానీ గుర్తుతెలియని వృద్ధురాలు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నెల్లూరులోని కరెంటాఫీస్ గేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై శుక్రవారం జరిగింది. మృతురాలి వయసు 70 నుంచి 75 ఏళ్ల లోపు ఉంటుందని భావిస్తున్నారు. మెడలో ఎర్రని దారం ధరించి ఉంది. మృతదేహానికి సమీపంలో ఎరుపు రంగు దుప్పటి పడి ఉంది. నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంటకాలువలో మృతదేహం



నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని ములుమూడి గ్రామానికి సమీపంలోని పంటకాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని చెబుతున్నారు. మృతుడు బులుగు, నలుపు, ఎరుపు రంగు గడుల ఫుల్ హ్యాండ్స్ షర్ట్ ధరించి ఉన్నాడు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక..

- వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరులోని పోలీస్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దర్గామిట్టలోని పోలీస్ కాలనీలో డి.అనిల్ కుమార్ (39), మానస దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనిల్ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలోనే అతను అప్పులపాలయ్యాడు. ఈ విషయమై దంపతుల నడుమ తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇటీవల అప్పుల బాధలు అధికమయ్యాయి. గురువారం రాత్రి అనిల్ తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గదిలోకి వెళ్లిన అనిల్ ఎంతకీ బయటకు రాకపోవడంతో భార్యాపిల్లలు తలుపులు బలంగా నెట్టడంతో తెరుచుకున్నాయి. ఫ్యాన్‌కు వేలాడుతున్న అనిల్ కుమార్‌ను కిందకు దించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి తల్లి నారాయణమ్మ శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వన్యప్రాణులకు తాగునీటి ఏర్పాట్లు



నీరు నింపుతున్న ట్యాంకర్

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లలో ట్యాంకర్ల ద్వారా నీరు నింపుతున్నట్లుగా జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్‌బాషా తెలిపారు. 'వన్యప్రాణుల గొంతెండుతోంది' అనే శీర్షికన శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి ఆయన స్పందించారు. పెంచల నరసింహ వైల్డ్ లైఫ్ అటవీ ప్రాంతంలో ఇప్పటికే వన్యప్రాణులకు నీటివసతి కల్పించినట్లు తెలిపారు.

అభ్యర్థులతో అధికారుల ఆటలు

- పరీక్ష వాయిదాపై సమాచారం ఇవ్వని విద్యాశాఖ
- సుదూర ప్రాంతాల నుంచి రాక
- వాయిదా పడిందని తెలుసుకుని నిరసన తెలిపిన వైనం



హాల్‌టికెట్లు చూపుతూ నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

నెల్లూరు(టౌన్): టీచర్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో అధికారులు ఆటలాడుకుంటున్నారు. పరీక్ష వాయిదాపై వారికి కనీసం సమాచారం ఇవ్వకపోవడంతో అభ్యర్థులు రూ.వేలు ఖర్చు పెట్టుకుని దూర ప్రాంతాల నుంచి నెల్లూరుకు వచ్చి ఇబ్బందులు పడ్డారు. తమకు జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీ కోసం అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష వాయిదాపై తమకు ఎలాంటి సమాచారం లేదంటున్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులను అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. శుక్రవారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు అభ్యర్థులు నెల్లూరు పొట్టేపాళెంలో పరీక్ష కేంద్రమైన అయాన్ డిజిటల్ ఎదుట తమ హాల్‌టికెట్లతో నిరసన వ్యక్తం చేశారు.

సమాచారం ఇవ్వకుండా..

కస్తూరిదేవి బాలికల ఉన్నత పాఠశాల, గూడూరులోని శ్రీపొట్టి శ్రీరాములు ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల కోసం సుమారు 1,600 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. శుక్ర, శనివారాల్లో పరీక్షలు నిర్వహిస్తామని అభ్యర్థులకు విద్యాశాఖ అధికారులు మెసేజ్‌లు పంపారు. ఆ శాఖ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా సూచించారు. అయితే పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహణపై ఆయా ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీంతో పరీక్ష నిర్వహణపై హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ విషయంపై అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖాధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. వాయిదాపై పత్రికా ప్రకటనలు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. శ్రీకాకుళం, అనంతపురం, కర్నూలు, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో ఉంటున్న అభ్యర్థులకు వాయిదా విషయం తెలియకపోవడంతో నెల్లూరులోని పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. అక్కడి సిబ్బంది వారిని లోనికి పంపకపోవడంతో ఆందోళనతో జిల్లా విద్యాశాఖాధికారులను ఫోన్‌లో సంప్రదించారు. వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరాశతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఆశగా ఎదురు చూశాం



పరీక్షలు జరిగి ఉపాధ్యాయ ఉద్యోగం వస్తుందనే ఆశతో ఎదురు చూశాం. ఎంతో దూరం నుంచి ఇబ్బంది పడుతూ నెల్లూరుకు వచ్చాం. ఇక్కడ పరీక్షను నిర్వహించలేదు. అధికారుల నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడటం తగదు.

టి.మేరీ, ప్రకాశం జిల్లా

బాధగా ఉంది



పరీక్షల నిర్వహణపై కోర్టు స్టే ఇచ్చిన విషయం నాకు తెలియదు. వ్యయప్రయాసలకోర్చి నెల్లూరుకు వచ్చాను. పరీక్ష నిర్వహించకపోవడంతో ఎంతో దూరం నుంచి వచ్చిన నాకు బాధగా ఉంది.

– తిరుపతిరావు, శ్రీకాకుళం జిల్లా

ఇది దారుణం



పరీక్షను వాయిదా వేయడంపై మాకు కనీస సమాచారం ఇవ్వకపోవడం దారుణం. పరీక్ష ఉంటుందని మెసేజ్ పంపించిన అధికారులు వాయిదా వేసిన దానిపై ఎందుకు మెసేజ్ పంపించలేదు. నిరుద్యోగులను విద్యాశాఖాధికారులు ఇంత చులకనగా చూడటం తగదు. ఇందుకు కారణమైన జిల్లా అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మహబూబ్‌బాషా, కర్నూలు జిల్లా

ఎంతో ఖర్చు పెట్టి వచ్చాం



ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నాం. నెల్లూరుకు మా ప్రాంతం ఎంతో దూరం. అయినా ఉద్యోగం వస్తుందనే ఆశతో దరఖాస్తు చేసుకున్నా. డబ్బు ఖర్చు పెట్టుకుని అంతదూరం ఇక్కడకు వస్తే పరీక్ష వాయిదా పడిందని తెలిసింది. ముందుగా సమాచారం ఇచ్చి ఉంటే డబ్బులు మిగిలి ఉండేవి.

– వెంకటరమణ, వైఎస్సార్ కడప జిల్లా

ఇంత నిర్లక్ష్యం పనికిరాదు



తొలి నుంచి ఎయిడెడ్ పాఠశాలల పోస్టుల నియామకంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పరీక్ష వాయిదాపై సమాచారం ఎందుకు పంపలేదు. పరీక్ష నిర్వహణ తేదీలను కూడా కేవలం రెండు రోజుల ముందే ప్రకటించడం అన్యాయం. పరీక్ష ఉంటుందనే ఆశతో ఇక్కడికి వస్తే వాయిదా పడిందని తెలిసి బాధపడుతున్నాం.

– మునికుమార్, కర్నూలు జిల్లా

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లుగా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణపై నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు, రేషన్, దీపం, అన్న క్యాంటీన్లు, ఎరువులు, విత్తనాలు, పారిశుద్ధ్యం, ఆర్టీసీ సేవలు, దేవాలయాలు, వైద్యశాలలు, రోడ్లు, ఇసుక, మద్యం దుకాణాలు తదితర అంశాలపై అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వారం, ఒక్కో అంశంపై నాలుగు వారాల్లో ప్రభుత్వ సేవలన్నింటిపై అభిప్రాయాలు తీసుకుంటారన్నారు. దేనిపైనైనా ఒకే ప్రాంతం నుంచి తరచూ వ్యతిరేక అభిప్రాయం వ్యక్తమవుతుంటే విచారించి ఆయా శాఖల అధికారులను హెచ్చరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, ఏఎస్పీ పి.సౌజన్య, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీఎంహెచ్‌ఓ సుజాత, డీసీహెచ్ఎస్ శేషారత్నం, విద్యుత్ ఎస్ఈ విజయన్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ అమలుకు కమిటీలు

స్వర్ణాంధ్ర – 2047 విజన్ యాక్షన్ ప్లాన్ అమలుకు నియోజకవర్గ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాల్లో శుక్రవారం కమిషనర్ సూర్యతేజతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కమిటీలు ఏర్పాటు చేయాలని చీఫ్ ప్లానింగ్ అధికారి నరసింహారావుకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలు చైర్మన్లుగా ఉంటారన్నారు. 8 నియోజకవర్గాల్లో కమిటీలను త్వరగా నియమించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

'నీట్'కు పక్కాగా ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)కు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాల్లో శుక్రవారం నీట్‌పై కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే నెల 4వ తేదీన నేషనల్ టెస్ట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పరీక్షను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో సుమారు 4 వేలకు పైగా హాజరుకానున్నారని ప్రభుత్వ విద్యాసంస్థలను మాత్రమే కేంద్రాలుగా ఎంపిక చేయాలన్నారు. నెల్లూరు సిటీకి దగ్గరగా భద్రత, రవాణాకు ఇబ్బందుల్లేకుండా ఉండే కేంద్రాలను రెండు రోజుల్లో ఎంపిక చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీఈఓ బాలాజీరావు, కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపల్ కె.శంకరయ్య, సీనియర్ ఉపాధ్యాయురాలు దొరసానమ్మ, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులే శాస్త్రవేత్తలుగా మారాలి

- భారత వరి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుబ్బారావు



ప్రదర్శనను ప్రారంభిస్తున్న శాస్త్రవేత్తలు

కందుకూరు రూరల్: 'రైతులే శాస్త్రవేత్తలుగా మారాలి. నూతన వంగడాలకు రూపకల్పన చేసి వారి పేరు మీదే రిజిస్టర్ చేసుకుని లైసెన్స్, హక్కులు పొందాలి' అని భారత వరి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎల్‌పీ సుబ్బారావు అన్నారు. కందుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో పంట వంగడాల పరిరక్షణ, రైతు చట్టం 2001 (పీపీవీ అండ్ ఎఫ్ఆర్ఏ) అనే అంశంపై శుక్రవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుబ్బారావు మాట్లాడుతూ రైతులు వారి పొలంలో తిరిగే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించి ప్రత్యేక లక్షణాలున్న మొక్కల్ని గుర్తించాలన్నారు. వాటిని వేరు చేసి 2 నుంచి 3 సంవత్సరాలు పండించాలన్నారు. పూర్తి వివరాలతో అథారిటీకి దరఖాస్తు చేసుకుంటే తద్వారా వాటిని పరిశీలించి ఆ రైతుకు హక్కులను ఇస్తారన్నారు. ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ విజయభాస్కర్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా 8,500 హక్కులను రైతులకు అందించామన్నారు. సీడీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త అనురాధ మాట్లాడుతూ రైతుల దగ్గర ప్రత్యేక లక్షణాలున్న వంగడాలుంటే కేవీకే దృష్టికి తీసుకురావాలన్నారు. ఔత్సాహికుల ద్వారా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఉత్తమ రైతులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. రైతులతో శాస్త్రవేత్తలు ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు అనసూయ, వ్యవసాయాధికారులు వి.రాము, హేమంత్ భరత్, రైతులు, రైతు మహిళలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాధవ, కృష్ణారెడ్డి, రాజు, ఉద్యాన కళాశాల ఇంటర్న్‌షిప్ విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓవైపు చదువు.. మరోవైపు బాడీ బిల్డింగ్

- పోటీల్లో రాణిస్తున్న కందుకూరు యువకుడు
- 60 కేజీల విభాగంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ
- మిస్టర్ ఆసియా టైటిల్ అందుకోవడమే లక్ష్యం



బాడీ బిల్డర్ అలీమ్

కందుకూరు: ఓ యువకుడు బాడీ బిల్డింగ్ పోటీల్లో విశేషంగా రాణిస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొంటూ మిస్టర్ ఆసియా టైటిల్ అందుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. కందుకూరు పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన షేక్ కరిముల్లా కుమారుడు షేక్ అలీమ్ ప్రస్తుతం ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో ఎంటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బీటెక్ చదివే రోజుల్లో జిమ్‌కు వెళ్లడం అలవాటు చేసుకున్నాడు. కొంతకాలానికి బాడీ బిల్డింగ్ పోటీలపై ఆసక్తి పెంచుకున్నాడు. 2018 నుంచి తీవ్ర కసరత్తు చేశాడు. 2020లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొన్న అలీమ్ 5వ స్థానంలో నిలిచాడు. తర్వాత హైదరాబాద్‌లో జరిగిన మిస్టర్ తెలంగాణ పోటీల్లో పాల్గొని టాప్ టెన్‌లో స్థానం సాధించాడు. 2023లో జరిగిన మిస్టర్ ఆంధ్రా పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగిన జాతీయపోటీల్లో దాదాపు 2,000 మంది పాల్గొనగా టాప్‌టెన్‌లో నిలిచాడు.

ఆ టైటిల్ కోసం..

అలీమ్ మిస్టర్ ఆసియా పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి దేశానికి పేరు తేవడమే తన లక్ష్యమని చెబుతున్నాడు. దీని కోసం వచ్చే డిసెంబర్ లేదా 2026 ఏడాది ప్రారంభంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మరోసారి పాల్గొననున్నట్లు తెలిపాడు. దీని కోసం ప్రస్తుతం కఠోరమైన శిక్షణ తీసుకుంటున్నాడు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాలంటే వరుసగా మూడుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఒకటి లేదా రెండో స్థానంలో నిలవాల్సి ఉందని, ఈ లక్ష్యాన్ని చేరడంతో పాటు, మిస్టర్ ఆసియా టైటిల్ సాధించేందుకు కష్టపడుతున్నట్లు చెప్పాడు.

పోటీల కోసం కఠోర సాధన

పోటీల కోసం అలీమ్ నెల్లూరులోని ఓ జిమ్‌ను ఎంపిక చేసుకున్నాడు. ఓ అంతర్జాతీయ కోచ్ రోజూ ఆన్‌లైన్‌లో ఇచ్చే సలహాలు, సూచనలు పాటిస్తున్నాడు. పోటీలకు సిద్ధమయ్యే క్రమంలో భిన్నమైన ఆహార అలవాట్లను పాటించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అలీమ్ ప్రతి నెలా తన ఆహారం కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. అతనికి పేదరికం పెద్ద సవాల్‌గా మారింది. పోటీలకు శిక్షణ తీసుకోవడం అనేది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కందుకూరులో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేసే తండ్రి కరిముల్లాకు కుమారుడి శిక్షణకు అవసరమయ్యే మొత్తాన్ని భరించడం కష్టతరంగా మారింది. ఎవరైనా తనని స్పాన్సర్ చేయడానికి ముందుకొస్తే కచ్చితంగా అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నాడు.

వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి



సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: వెట్టిచాకిరీని నిర్మూలించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలని నెల్లూరు ఆర్డీఓ అనూష కోరారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో నెల్లూరు, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులకు శుక్రవారం వెట్టిచాకిరి నిర్మూలన చట్టంపై సాంఘిక సంక్షేమ శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు శ్యామ్, గంటా ప్రియాంక ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ, పోలీస్, లేబర్, విద్య, వైద్య ఇతర శాఖల సమన్వయంతోనే వెట్టిచాకిరి నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. ఇటుకబట్టీలు, రైస్‌మిల్లులు, హోటళ్లు, మద్యం దుకాణాలు, పలు వ్యాపార సంస్థల్లో అధికారులు నిర్వహించే తనిఖీలు ఎంతోమంది అభాగ్యుల జీవితాలను మారుస్తాయన్నారు. వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందిన వ్యక్తికి కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా రిలీజ్ సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, చైతన్య జ్యోతి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు, పలు వ్యాపార సంస్థలు, హోటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.75 సన్నవి : రూ.60
పండ్లు : రూ.35

సెలవు రోజుల్లోనూ బిల్లులు చెల్లించవచ్చు

- ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉగాది, రంజాన్ రోజుల్లోనూ జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేస్తాయని, ప్రజలు బిల్లులు చెల్లించవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ తెలిపారు. నెల్లూరులోని విద్యుత్ భవన్ నుంచి శుక్రవారం జిల్లా విద్యుత్ అధికారులు, అకౌంట్స్ విభాగం అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పర్వదినాల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని దేవాలయాలు, మసీదుల్లో నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు పనిచేస్తాయని, అధికారులు, సిబ్బంది పెండింగ్‌లో ఉన్న బిల్లుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. వసూళ్లు తక్కువగా ఉన్న విద్యుత్ సెక్షన్ ఆఫీసర్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. పండగ రోజుల్లో గృహ, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరా అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. డీఈటీ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.